# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 09-06-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో జాతీయ రహదారులు, పీపీపీ విధానంలో రహదారుల నిర్మాణంపై అమరావతి సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నారు.**
2. **రాష్ట్రంలోని నగర పాలక సంస్థలు, పురపాలక సంస్థల్లో ఇంటింటికి తాగునీటి సరఫరా కోసం 13 వేల కోట్ల రూపాయలను వెచ్చించనున్నామని మంత్రి పి.నారాయణ తెలిపారు.**
3. **అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో ఈ రోజు యోగా ర్యాలీ, అవగాహన కార్యక్రమాలు జరిగాయి.**
4. **రాష్ట్రంలో పర్యాటకులు అధికంగా సందర్శించే ప్రాంతాలైన అరకు, గండికోట, సూర్యలంకలో రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ ప్రయోగాత్మకంగా మూడు టెంట్ సిటీలను అభివృద్ధి చేయనుంది.**

==========================

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో జాతీయ రహదారులు, పీపీపీ విధానంలో రహదారుల నిర్మాణంపై అమరావతి సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో ఏర్పాటు చేసిన స్వర్ణాంధ్ర కార్యాలయాలను మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాలకు దృశ్య మాధ్యమ విధానంలో ఆయన ప్రారంభించనున్నారు. అనంతరం 3 గంటల 30 నిమిషాలకు గనులు, 4 గంటలకు స్టేట్ క్వాంటమ్ మిషన్‌పై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించనున్నారు.

--------------------------

రాష్ట్రంలోని నగర పాలక సంస్థలు, పురపాలక సంస్థల్లో ఇంటింటికి తాగునీటి సరఫరా చేసేందుకు 13 వేల కోట్ల రూపాయలను వెచ్చించనున్నామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. ఈ పనులకు సంబంధించి త్వరలోనే టెండర్లను పిలుస్తామని ఆయన వెల్లడించారు నెల్లూరు నగరంలోని వివిధ ప్రాంతాల్లో కాలువల్లో పూడికతీత పనులను ఆయన ఈ రోజు అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ..ముఖ్యమంత్రి ఆదేశాలతో 50 కోట్ల రూపాయలతో రాష్ట్ర వ్యాప్తంగా 123 మున్సిపాలిటీల్లోని కాలువలలో పూడికతీత పనులను చేపట్టామని వెల్లడించారు.

--------------------------

గత దశాబ్ద కాలంలో భారత్ అనేక రంగాల్లో గణనీయమైన మార్పులు సాధించింది. సేవ, సుపరిపాలన,

పేదల సంక్షేమం అనే అంశాల ఆధారంగా గత 11 సంవత్సరాలలో కీలక రంగాలలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. కేంద్ర ప్రభుత్వ చొరవతో గతంలో అభివృద్ధికి దూరంగా ఉన్న ఈశాన్య భారతం ఇప్పుడు దేశాభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తోంది.

..వాయిస్ ...39 సెకన్లు

-----------------------------

రాష్ట్రంలో పర్యాటకులు అధికంగా సందర్శించే ప్రాంతాల్లో వసతుల కల్పనకు రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ.. ఏపీటీడీసీ ప్రాధాన్యమిస్తోంది. అరకు, గండికోట, సూర్యలంకలో ప్రయోగాత్మకంగా మూడు టెంట్ సిటీలను అభివృద్ధి చేయనుంది. అరకులో ఏపీటీడీసీ ఆధ్వర్యంలో, మిగిలిన రెండుచోట్లా ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో వీటి ఏర్పాటుకు టెండర్లు పిలవనున్నారు. తద్వారా 150 గదులు పర్యాటకులకు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకోసం 50 కోట్ల రూపాయలకుపైగా ఖర్చు చేయనున్నారు.

-----------------------------

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర-2025 పేరుతో నెల రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా పలు జిల్లాల్లో ఈ రోజు యోగా ర్యాలీ, అవగాహన కార్యక్రమాలు జరిగాయి. చిత్తూరు జిల్లా చౌడేపల్లి మండలం బోయకొండలో యోగాంధ్ర కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డితో పాటు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, పోలీస్ సూపరింటెండెంట్ మణికంఠ పాల్గొన్నారు. శ్రీకాకుళంలో అన్ని ప్రభుత్వ శాఖల సహకారంతో ఆర్ట్స్ కళాశాల నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు యోగా అవగాహన ర్యాలీ జరిగింది. అనంతరం ఏడురోడ్ల కూడలిలో భారీ మానవహారం నిర్వహించారు.

-----------------------------

ఏలూరు సీఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్ నుంచి ఇండోర్ స్టేడియం వరకు భారీ ర్యాలీలో ప్రజలు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఇండోర్ స్టేడియంలో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య, మేయర్ షేక్ నూర్జహాన్, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తదితరులు యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. యోగా సాధనతో ఆరోగ్య పరిరక్షణతో పాటు, మెరుగైన జీవన విధానం అలవడుతుందని వివరిస్తూ..

...వాయిస్... 24 సెకన్లు

-----------------------------

రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని అనంతపురం జిల్లా రాప్తాడు శాసనసభ్యురాలు పరిటాల సునీత అన్నారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఈరోజు అనంతపురంలో ప్రభుత్వం నిర్వహించిన షైనింగ్ స్టార్స్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిటాల సునీత మాట్లాడుతూ ప్రతి విద్యార్థి బాగా చదివి ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

-----------------------------

యోగాపై అవగాహన కల్పిస్తూ తిరుపతిలో ఈ రోజు ర్యాలీ నిర్వహించారు. యోగాంధ్ర అవగాహనా

ర్యాలీని తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. నగర పాలక సంస్థ కార్యాలయం నుంచి టౌన్ క్లబ్ వరకు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని శ్రీనివాసులు సూచిస్తూ..

..వాయిస్.. 28 సెకన్లు

----------------------------

అన్నమయ్య జిల్లాలో ప్రత్యేక యోగా కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ రూపొందించారు. తాళ్లపాక గ్రామంలో అన్నమయ్య 108 అడుగుల విగ్రహం దగ్గర ఆయన 617 జయంతిని పురస్కరించుకొని 617వ మందితో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు.

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈ రోజు యోగా ర్యాలీలు నిర్వహించారు. నెల్లూరు నగరంలోని ముత్తుకూరు సెంటర్ నుంచి చిల్డ్రన్స్ పార్క్ వరకూ జరిగిన ర్యాలీలో జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ కార్తీక్.. నగరపాలక సంస్థ కమిషనర్ నందన్ పాల్గొన్నారు.

----------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితి గురించి అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎమ్. వెంకటరావు ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్...35 సెకన్లు

----------------------------

రాష్ట్ర పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ..మెప్మా 9 స్కోచ్ అవార్డులను దక్కించుకుంది. వివిధ కేటగిరీల్లో నామినేట్ అయిన 14 ప్రాజెక్టులకు గాను 9 ప్రాజెక్టులకు ప్లాటినం అవార్డులు ప్రకటించారు. దుర్భర జీవితాన్ని గడిపేవారిని ఆర్థికంగా బలోపేతం చేసే నివాస, బ్యాంక్ లింకేజీ, లైవ్‌లీ హుడ్ ట్రాకర్, ఈ-కామర్స్ అమ్మకాలు, నైపుణ్యాభివృద్ధి, జీవనోపాధి యూనిట్లు, ప్రేరణ, సఖి, వీధి వ్యాపారుల మేనేజ్‌మెంట్ తదితర పథకాలకు అవార్డులను అందజేయనున్నారు. సెప్టెంబరు 20వ తేదీన ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన.తేజ్‌భరత్ ఈ అవార్డులను అందుకోనున్నారు.

----------------------------

ప్రకాశం జిల్లాలో ఈరోజు నుంచి నాలుగు రోజుల పాటు కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖా అధికారులు పర్యటించనున్నారు. ఆ శాఖ సంయుక్త సంచాలకుల స్థాయి అధికారులు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి.. ఉపాధి హామీ పథకం, వాటర్ షెడ్ కార్యక్రమాలు, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, ఇతర పథకాల అమలు తీరును పరిశీలిస్తారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరు పరిశీలనకు ఏటా ఒక రాష్ట్రంలో అధికారుల బృందం పర్యటిస్తుంటుంది. అందులో భాగంగానే ఈసారి ప్రకాశం జిల్లాను వారు ఎంపికచేసుకున్నారు.

=====================